సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

సోమవారం । 29 । సెప్టెంబర్ । 2025



సారథి.. వాహనదారులకు వారధి

ప్రభుత్వం రవాణా శాఖలో తీసుకొచ్చిన సారథి పోర్టల్ విధానాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చి సేవలందిస్తోంది. - 8లో



విద్యా రంగంలో కొత్త అధ్యాయం..

సమ్మక్క, సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఉన్నత విద్యావకాశాలు అందుతాయని మంత్రి సీతక్క అన్నారు. - 8లో

గరిష్టం/కనిష్టం
31.0^0 /25.0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

విద్యుత్ దీపాల కాంతుల్లో హనుమకొండలోని పద్మాక్షి దేవాలయం



వరంగల్ హెడ్ పోస్టాఫీస్ సెంటర్ వద్ద పూలు కొంటున్న మహిళలు





సద్దులకు సిద్ధం

గ్రేటర్ వరంగల్ నగరంలో నేడు, రేపు బతుకమ్మ సంబురాలు

- వరంగల్ స్టేషన్ రోడ్డులో పూల కొనుగోళ్ల సందడి
- కిటకిటలాడిన రహదారులు, చౌరస్తాలు

హన్మకొండ కల్చరల్: సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోవడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. కాగా, కొన్ని ప్రాంతాల్లో సోమవారం వేడుకలు జరుపుకోనుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో మంగళవారం వేడుకలు నిర్వహించుకోనున్నారు. తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్ర శర్మ, నగరంలోని వేదపండితులు సోమవారం వేడుకలు జరుపుకోవాలని చెబుతుండగా.. తెలంగాణ రాష్ట్ర విద్వత్‌సభ నిర్ణయం ప్రకారం ప్రభుత్వం మాత్రం మంగళవారం చేసుకోవాలని ప్రకటించింది. దీంతో ఈ ఏడాది సద్దులు రెండు రోజులపాటు జరుపుకోనున్నారు. నగరంలో బతుకమ్మ ఆట స్థలాల్లో మహానగర పాలక సంస్థ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. వీధి దీపాలతో పాటు బతుకమ్మతో తల్లీబిడ్డ విగ్రహాలకు రంగులతోపాటు సిరీస్ బల్బులు ఏర్పాటు చేశారు. ఆట స్థలాలు విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్నాయి.

వరంగల్ స్టేషన్‌రోడ్డు, హెడ్‌పోస్టాఫీస్ జంక్షన్‌లో ఆదివారం వివిధ రకాల పూల విక్రయాలతో సద్దుల బతుకమ్మ పండుగ సందడి కనిపించింది. సోమవారం హనుమకొండ, వరంగల్ నగర పరిధి పలు డివిజన్లలో సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని ప్రజలంతా వైభవంగా జరుపుకునేందుకు సిద్ధపడుతున్నారు. పలు గ్రామాల నుంచి మహిళలు పూలు సేకరించి విక్రయించేందుకు నగరానికి తీసుకొచ్చారు. వరంగల్ స్టేషన్ రోడ్డులోని హెడ్ పోస్టాఫీస్ జంక్షన్‌కు ఇరువైపులా చిరు వ్యాపారులు తంగేడు, గునుగు పూలు, బంతి పూలు విక్రయానికి ఉంచారు. గతేడాదికంటే ఈఏడాది పూల ధరలు పెరిగాయి. లాభాలు సైతం బాగానే వచ్చాయని చిరువ్యాపారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

స్టేషన్ రోడ్డులో సందడి

నేడే సద్దుల బతుకమ్మ

- శరన్నవరాత్రులు, బతుకమ్మకు సంబంధం లేదు
- పురోహితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేంద్రశర్మ



మాట్లాడుతున్న పురోహితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగేంద్రశర్మ

హన్మకొండ చౌరస్తా: బతుకమ్మ పండుగకు, దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు సంబంధం లేదని తెలంగాణ పురోహితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర నాగేంద్రశర్మ అన్నారు. నేడు (సోమవారం) బతుకమ్మ పండుగ జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. హనుమకొండ బ్రాహ్మణవాడలోని బ్రాహ్మణభవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బతుకమ్మ ఆచారం మాత్రమేనని, పండితులు, జ్యోతిష్య సామ్రాట్లు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. సోమవారం సద్దులు జరుపుకోవాలని భద్రకాళి శేషు సతీమణి సైతం సూచించినట్లు తెలిపారు. రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. గతంలో ఇలాంటి వివాదాలు తలెత్తినప్పుడు వేయిస్తంభాల గుడి వేదికగా తాను భక్తులు, ప్రభుత్వానికి దిశా నిర్దేశం చేశానని గుర్తుచేశారు. సోమవారమే సద్దుల వేడుక జరుపుకోవాలని సూచించారు. సమావేశంలో చెరుకుపల్లి శ్రీనివాసాచార్యులు, యెల్లంభట్ల లక్ష్మణ్‌శర్మ, అయినవోలు మధుకర్‌శర్మ, తనుగుల రత్నాకర్, లంకా శివకుమార్‌శర్మ, కలకోట రాఘవాచార్యులు, కలకోట సంపత్‌చార్యులు, తిరువరంగం ప్రభాకరచార్యులు, చిమిరాల శ్రీధరాచార్యులు, నరసింహమూర్తి, శ్రీనివాసశర్మ, జీవీఎస్ శ్రీనివాసాచార్యులు, రఘునాథాచార్యులు, శ్రీనాథ్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు గ్రేటర్ గ్రీవెన్స్ రద్దు

వరంగల్ అర్బన్: సద్దుల బతుకమ్మ, దసరా వేడుకల ఏర్పాట్లలో అధికారులు, ఉద్యోగులు నిమగ్నమైనందున సోమవారం గ్రీవెన్స్ సెల్‌ను రద్దు చేస్తున్నట్లు బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. నగర ప్రజలు ఫిర్యాదులు అందించడానికి గ్రీవెన్స్‌సెల్‌కు రావొద్దని విజ్ఞప్తి కమిషనర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వరంగల్ గ్రీవెన్స్ కూడా..

న్యూశాయంపేట: కలెక్టరేట్‌లో సోమవారం(నేడు) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సద్దుల బతుకమ్మ పండుగ దృష్ట్యా రద్దు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలక్టరేట్‌కు రావొద్దని కోరారు.

గౌతంయాదవ్‌కు బ్లాక్ బెల్ట్



వరంగల్ స్పోర్ట్స్: న్యూఢిల్లీలోని కొరియన్ కల్చరల్ సెంటర్‌లో ఈ నెల 26 నుంచి 28 వరకు నిర్వహించిన కుక్కినాడ్ హైదాన్ శిక్షణ, పరీక్షను నగరంలోని పైడిపల్లికి చెందిన ఎల్లావుల గౌతంయాదవ్ విజయవంతంగా పూర్తిచేశాడు. ఈ సందర్భంగా ప్రముఖ గ్రాండ్ మాస్టర్లు సియోంగ్‌రాన్ సోఖెల్, డాక్టర్ జోసెఫెలీ, జిమ్మీ చేతుల మీదుగా గౌతంయాదవ్ నాలుగో డాన్ బ్లాక్‌బెల్ట్ సర్టిఫికెట్ అందుకున్నాడు. ఎస్‌ఎంఏ తైక్వాండో అకాడమీ ద్వారా తెలంగాణలోని అన్ని జిల్లాల్లో తైక్వాండో అభివృద్ధి చేస్తానని గౌతంయాదవ్ తెలిపాడు.

ఇద్దరు ఉపాధ్యాయులకు గ్రూప్-2 ఉద్యోగాలు



ఆర్.మహేందర్ ఆర్.తిరుపతి

విద్యారణ్యపురి: గ్రూప్-2 పరీక్ష ఫలితాలు టీజీపీఎస్సీ ఆదివారం వెల్లడించింది. ఇద్దరు ప్రభుత్వ టీచర్లు గ్రూప్-2 పోస్టులకు ఎంపికయ్యారు. హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఆర్.మహేందర్ జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ సెక్రటేరియెట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో 355 మార్కులతో ఆయన 1,162వ ర్యాంకు సాధించారు. జనగామ జిల్లా చిల్పూరు మండలం శ్రీపతిపల్లి గ్రామానికి చెందిన మహేందర్ 2008 డీఎస్సీలో ఎస్‌జీటీ ఎంపికయ్యారు. నయీంనగర్‌లో నివాసం ఉంటున్నారు.


ఏడీఓగా రాచమల్ల తిరుపతి ఎంపిక

వరంగల్‌లోని దేశాయిపేటరోడ్డులోని ప్రభుత్వ మౌలాలి పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వర్తిస్తున్న రాచమల్ల తిరుపతి గ్రూప్-2లో అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (ఏడీఓ) పోస్టుకు ఎంపికయ్యారు. 2008 డీఎస్సీలో ఎస్‌జీటీగా ఎంపికైన ఆయన కొన్ని సంవత్సరాలుగా గ్రూప్ పోస్టులపై దృష్టి సారించారు. 2016లో ఒకసారి గ్రూప్-2 రాతపరీక్షలో ప్రతిభచూపి ఇంటర్వ్యూ వరకు వెళ్లినా ఉద్యోగానికి ఎంపిక కాలేదు. రెండోసారి సఫలీకృతుడయ్యారు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం నేరేడుపల్లి గ్రామానికి చెందిన తిరుపతి రాష్ట్రస్థాయిలో 829వ ర్యాంకు సాధించారు. గ్రూప్-2 జోనల్ పోస్టు అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా హనుమకొండ జిల్లాకు ఎంపికయ్యారు.

ఖజానా ఖాళీ!

జీడబ్ల్యూఎంసీలో కనిష్ట స్థాయికి నగదు నిల్వలు

- నగరంలో మందగించిన పన్నుల రాబడి
- పండుగపూట కార్మికులకు చెల్లించని వేతనాలు
- అభివృద్ధి పనులకు నిలిచిన బిల్లుల చెల్లింపు



వరంగల్ అర్బన్: వరంగల్ మహానగరపాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ)కు ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఖజానా ఖాళీ అయ్యింది. రెండు నెలలుగా రూ.11 కోట్లు సర్దుబాటు చేయడం కత్తిమీద సామవుతోంది. ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల వేతనాలు, ఇంధనం, కరెంట్ బిల్లులు, పరిపాలన వ్యయం, ఇతర అత్యవసర బిల్లులు చెల్లించేందుకు అకౌంట్స్ విభాగాధికారులు తంటాలు పడుతున్నారు. తెలంగాణలో అతి పెద్ద పండుగలు సద్దుల బతుకమ్మ, దసరాకు ముందే కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితి దాపురించింది. 25లోగా వేతనాలు ఇవ్వాలని జేఏసీ నాయకులు అధికారులను కలిసి విజ్ఞప్తి చేశారు. కానీ, ఖజానాలో అవసరమైన మేరకు నిల్వలు లేనట్లు అధికారులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో కొద్ది నెలలుగా అభివృద్ధి పనుల బిల్లులను నిలిపివేశారు. పూర్తిచేసిన అభివృద్ధి పనుల బిల్లులు రూ.30 కోట్లు చెల్లించాలని కాంట్రాక్టర్లు పదేపదే కోరుతున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన వినాయక చవితి నిమజ్జనం, సద్దులు బతుకమ్మ, దసరా ఉత్సవాల బిల్లులు ఇంకా చెల్లించలేదు. ఈ ఏడాది వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. కనీసం గతేడాది బిల్లులైనా ఇప్పించాలని కాంట్రాక్టర్లు వేడుకుంటున్నారు. బిల్లులు ఇవ్వకుండా ఏర్పాట్లు ఎలా చేయాలని ప్రశ్నిస్తున్నారు. ఇంజనీర్లు ఏదో ఒక్క విధంగా నచ్చజెప్పి ఏర్పాట్లపై దృష్టి సారించారు. బల్దియా జనరల్ ఫండ్ ఖాళీ కావడంతో నూతన పనులపై సంతకాలు చేసేందుకు కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తున్నారు. కమిషనర్ పాస్ ఆర్డర్ వేస్తే చెక్కులు రాస్తూ సమర్పిస్తున్నారు. అయితే, ఏటా సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో పన్నుల రాబడి తక్కువగా ఉంటుంది. జనవరి నుంచి పన్నుల వసూళ్లు ఎక్కువగా ఉంటాయని అధికారులంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల సొమ్ము రూ. 180 కోట్లు బల్దియాకు మంజూరు చేసింది. కానీ, నిధులు సుమారు 50 రూ.కోట్లు విడుదల చేసింది. మిగిలిన నిధులతో టెండర్ల నిర్వహణ, ఒప్పందాలు జరుగుతున్నాయి. చెల్లింపులు మాత్రం నిలిపివేశారు.

నెలనెలా కష్టమే..

ఆస్తి పన్ను, భవన నిర్మాణ అనుమతులు, నల్లా ఫీజులే బల్దియా ప్రధాన ఆదాయ వనరులు. రెండు నెలలుగా వసూళ్లు రూ.8 నుంచి రూ.9 కోట్లు దాటడం లేదు. ప్రతి నెల జీతాలు, అత్యవసర బిల్లులు, కరెంట్ బిల్లులు, డీజిల్, పెట్రోల్ ఇలా మొత్తంగా రూ.11 కోట్ల మేర ఉంటుంది. దీంతో ప్రతి నెల సొమ్మును సర్దుబాటు చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. సద్దుల బతుకమ్మ, దసరాకు ముందు కార్మికులకు వేతనాలు అందిస్తే వారు నూతన దుస్తులు కొనుగోలు చేసి, ఇతర ఖర్చులకు సమకూర్చుకుంటారు. కానీ, వేతనాలు అందకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పదని పలువురు కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెల 25 నుంచి 25గా వేతనాలను లెక్కిస్తుంటారు. అందువల్ల బల్దియా మేయర్, కమిషనర్ ప్రత్యేకంగా చొరవ తీసుకొని పండుగకు ముందే వేతనాలు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కానీ, పాలకులు, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

పల్లకీసేవలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు



కాత్యాయనీదేవిగా అమ్మవారు

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఏడో రోజు ఆదివారం ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చకులు మణికంఠశర్మ, ప్రణవ్‌శర్మ, సందీప్‌శర్మ స్వామివారికి సుప్రభాతసేవ, అభిషేకాలు, ఉత్సవమూర్తికి శ్రీసూక్తవిధానంతో పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, చతుషష్టి ఉపచారపూజలు నిర్వహించారు. అనంతరం కాత్యాయనీదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఐరావత వాహనంపై ప్రతిష్ఠించి నిర్వహించిన పల్లకీ సేవలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి–నీలిమ దంపతులు, విష్ణువర్ధన్–గోదాదేవి దంపతులు పాల్గొన్నారు. యాగశాలలో రుద్ర హోమం, సుదర్శన, చండీహోమం నిర్వహించారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ సౌజన్యంతో భక్తులకు అన్నప్రసాదాల వితరణ చేశారు. సాయంత్రం నృత్యగురువు బొంపల్లి సుధీర్‌రావు శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈఓ అనిల్‌కుమార్ పర్యవేక్షించారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌గా వీరికే అవకాశం

ఎస్సీ మహిళకు హనుమకొండ జెడ్పీ రిజర్వు

హన్మకొండ: జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్‌గా మూడు స్థానాలకు అవకాశం దక్కనుంది. హనుమకొండ జిల్లా ప్రజాపరిషత్‌లో మొత్తం 12 జిల్లా ప్రజాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలున్నాయి. ఇందులో ఎల్కతుర్తి ఎస్సీ జనరల్, హసన్‌పర్తి ఎస్సీ మహిళ, ఐనవోలు ఎస్సీ జనరల్‌గా రిజర్వేషన్ ఖరారు చేశారు. గతంలో హనుమకొండ జిల్లా ప్రజాపరిషత్ చైర్‌పర్సన్ పదవి ఎస్సీ జనరల్ కాగా.. ఇప్పుడు ఎస్సీ మహిళకు రిజర్వేషన్ ఖరారైంది. దీంతో ఎస్సీలకు కేటాయించిన మూడు ప్రాదేశిక నియోజకవర్గాలు కీలకం కానున్నాయి. చైర్‌పర్సన్ పదవి ఆశిస్తున్న అభ్యర్థులు ఈమూడు స్థానాల్లో ఏదో ఒక స్థానం నుంచి అభ్యర్థిత్వాన్ని దక్కించుకోవాలనే ఆశలో ఉన్నారు.

వ్యూహాలకు పదును

హసన్‌పర్తి జెడ్పీటీసీ ఎస్సీ మహిళ కాగా, ఎల్కతుర్తి, ఐనవోలు ఎస్సీ జనరల్ అయ్యాయి. ఎస్సీ జనరల్ నుంచి మహిళ కూడా పోటీ చేసే అవకాశముంది. దీంతో చైర్‌పర్సన్ కావాలని ఆశిస్తున్న వారు ఈ మూడు స్థానాలపై కన్నేశారు. ఇప్పటి నుంచి అధినాయకత్వం దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల మెప్పు పొందేందుకు ఇప్పటి నుంచి వ్యూహాలకు పదును పెడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ వంటి ప్రధాన పార్టీలు కూడా ఈ మూడు జెడ్పీటీసీ స్థానాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. చైర్‌పర్సన్ అభ్యర్థిని ఈస్థానాల నుంచి పోటీ చేయించేందుకు పథకం రూపొందిస్తున్నారు. ఎస్సీ మహిళకు రిజర్వేషన్ అయిన స్థానం నుంచి మాత్రమే చైర్‌పర్సన్ అభ్యర్థిని పోటీ చేయిస్తే ఆమె ఓటమి పాలైతే మెజార్టీ స్థానాలు సాధించినా ఫలితముండదని భావిస్తున్న ప్రధాన పార్టీలు.. మరో స్థానం నుంచి కూడా ఎస్సీ మహిళను దింపాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో మహిళా జెడ్పీటీసీల సంఖ్య పెరుగనుంది. గత పాలక వర్గంలో ఎల్కతుర్తి నుంచి జెడ్పీటీసీగా గెలిచిన బీఆర్‌ఎస్‌కు చెందిన మారపల్లి సుధీర్‌కుమార్ చైర్మన్ అయ్యారు. ఈసారి కూడా ఎల్కతుర్తి, హసన్‌పర్తి, ఐనవోలు నుంచి గెలిచే మహిళ చైరపర్సన్ అయ్యే అవకాశలున్నాయి.

డిప్యూటీ కలెక్టర్‌గా మంద అపూర్వ

- సివిల్ సర్వీస్ ఉద్యోగానికి రాజీనామా చేసే అవకాశం



పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్న ఆనందంలో తల్లిదండ్రులతో అపూర్వ

కేయూ క్యాంపస్: హనుమకొండకు చెందిన కాకతీయ యూనివర్సిటీ ఎకనామిక్స్ రిటైర్డ్ ప్రొఫెసర్ మంద అశోక్ కుమార్–రజినీదేవి దంపతుల కూతురు అపూర్వ గ్రూప్–1 ఫలితాల్లో డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు ఎంపికయ్యారు. ఈనెల 27న హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఖమ్మం డిప్యూటీ కలెక్టర్‌గా పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్నారు. ఇప్పటికే యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో–2022లో అఖిలభారత స్థాయిలో 646వ ర్యాంకు సాధించిన అపూర్వ ప్రస్తుతం ముంబైలో మినిస్ట్రీ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ ఉద్యోగం చేస్తూనే గ్రూప్–1 కూడా రాసి విజయం సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. ఆమె తల్లి రజినీదేవి భీమదేవరపల్లి మండలం మాణిక్యాపూర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. అపూర్వ భర్త రఘుకార్తీక్ ప్రముఖ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు.

బాధితులకు భరోసా కల్పించాలి

సీపీ సన్‌ప్రీత్ సింగ్



సీపీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎస్సైలు

వరంగల్ క్రైం: పదోన్నతులతో బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎస్సైలుగా పదోన్నతి పొందిన ఎం.సాంబరెడ్డి, పి.జైపాల్, పి.లక్ష్మారెడ్డి, డి.వెంకటేశ్వర్లు, ఎం.సాంబయ్య, కె.వెంకన్న, డి.సమ్మిరెడ్డి, ఎం.లక్ష్మీనారాయణ, పి.శ్రీనివాస్ రాజు, ఎస్.సదయ్య ఆదివారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ పదోన్నతి పొందిన అధికారుల భుజాలపై నక్షత్రాలను అలంకరించి అభినందనలు తెలిపారు. అనంతరం సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసులు భరోసా, నమ్మకాన్ని కలిగించాలని, నిరుపేద ప్రజలకు పోలీసు అధికారులు అండగా నిలవాలని పదోన్నతి పొందిన ఎస్సైలకు సూచించారు.

కేసీఆర్ పాలనలో అగ్రగామిగా తెలంగాణ

- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్



బతుకమ్మ ఆడుతున్న సత్యవతిరాథోడ్, పద్మాదేవేందర్‌రెడ్డి, గొంగిడి సునీత, తుల ఉమ

హన్మకొండ: కేసీఆర్ పదేళ్ల పాలనలో దేశంలోనే తెలంగాణ అగ్రగామిగా నిలిచిందని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఆదివారం రాత్రి బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ సబ్బండ వర్గాలకు కేసీఆర్ సంక్షేమ పథకాలు అందించారని పేర్కొన్నారు. మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ సర్కారు అన్ని వర్గాలను మోసం చేసిందని విమర్శించారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కేసీఆర్ హయాంలో బతుకమ్మ పండుగకు చీరలు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం కంటి తుడుపుగా కానుకలు ఇస్తోందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ మాజీ విప్ గొంగడి సునీత మాట్లాడుతూ బతుకమ్మ పండుగను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తూర్పారబట్టారు. బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్‌ఎస్ మహిళా విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు తుల ఉమ, రాష్ట్ర మహిళా నేతలు సుశీలారెడ్డి, సుమిత్రా ఆనంద్, రేణుక, పావని గౌడ్, రజితారెడ్డి, దాస్యం వినయ్‌భాస్కర్ సతీమణి రేవతీభాస్కర్, దాస్యం విజయ్‌భాస్కర్ సతీమణి శిరీష, మహిళా నేతలు పెద్ది స్వప్న, ఎల్లావుల లలితాయాదవ్, డాక్టర్ హరి రమాదేవి, రిజ్వానా మసూద్, నల్ల స్వరూపారాణి, ఇమ్మడి లోహితా రాజు, నాయకులు దాస్యం విజయ్ భాస్కర్, సంకు నర్సింగ్ రావు తదితరులున్నారు.

పెంపుడు జంతువులతో రక్షణ

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: పెంపుడు జంతువులు చూపించే ప్రేమ మరెక్కడా లభించదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా బాలసముద్రంలోని పెట్ పార్కులో ఆదివారం జిల్లా పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రేబిస్ వ్యాధిపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచిత రేబిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇంట్లో పెంపుడు కుక్కలు, పిల్లులతో అపరిచితుల నుంచి రక్షణతోపాటు వాటి మనకు మానసిక ప్రశాంతత ఉంటుందని సూచించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ పెంపుడు కుక్కలకు లైసెన్స్ తీసుకోవాలని, రికగ్నైజ్డ్ బ్రీడర్స్ అమ్మేటప్పుడు రిజిస్టర్ చేయాలని, పెంచుకునే జంతువులను వీధుల్లో విడిచిపెట్టకుండా చూడాలని సూచించారు. వీధి కుక్కలకు అన్నం పెట్టే వారిని ప్రోత్సహించాలన్నారు. 182 కుక్కలు, పిల్లులకు రేబిస్ టీకాలు వేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వెటర్నరీ వైద్యులు ప్రవీణ్ కుమార్, నాగమణి, ఊర్మిళ, గోపాల్‌రావు, వినయ్, వంశీ, కరుణాకర్ రెడ్డి, రాజేశ్, వివేక్, సుధాకర్, నిఖిత, భగవాన్, డాగ్ బ్రీడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవేందర్, మారుతి, శ్రీను, గౌతం, అయ్యప్ప, దిలీప్, శివ, సాయి పాల్గొన్నారు.

సెలవుల్లో కూత!

సెలవుల వేళ టీవీలకు, ఫోన్లకు అతుక్కుపోతున్న నేటితరానికి భిన్నంగా.. ఇష్టమైన ఆటలో రాణించేందుకు 'కూత' పెడుతున్నారు కొందరు పిల్లలు. హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ మైదానంలో కోచ్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో కబడ్డీ ఆటలో మెలకువలు నేర్పుతున్నారు.



సారథి.. వాహనదారులకు వారధి

ఇంటి నుంచే డ్రైవింగ్ లైసెన్స్‌లు

- ఉమ్మడి జిల్లాలో అందుబాటులోకి పోర్టల్
- దేశవ్యాప్తంగా ఒకే పోర్టల్.. ఒకే లైసెన్స్ విధానం అమలు
- రోడ్డు భద్రతపై అవగాహన ఉంటేనే డ్రైవింగ్ లైసెన్స్
- త్వరలోనే ఆర్టీఏలో దళారుల వ్యవస్థ కనుమరుగు

ఖిలా వరంగల్ : రవాణా శాఖలో సంస్కరణల శకం మొదలైంది. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమలు చేస్తున్న వాహన్ వెబ్‌సైట్‌లోని డేటాబేస్‌తో రవాణాశాఖ అనుసంధానమైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రవాణా శాఖలో తీసుకొచ్చిన సారథి పోర్టల్ విధానాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అందుబాటులోకి తీసుకొచ్చి సేవలందిస్తోంది. వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలోని ఆర్టీఏ కార్యాలయాల్లో సారథి పోర్టల్ అమలుకు ఆగస్టు 18 తేదీన శ్రీకారం చుట్టారు. పోర్టల్‌లో తలెత్తుతున్న స్వల్ప సాంకేతిక ఇబ్బందులను దశల వారీగా సవరణ చేశారు. ప్రస్తుతం పోర్టల్‌లో నమోదు ప్రక్రియ విజయవంతమవుతోంది. ఇప్పటి వరకు సిటిజన్ ఫ్రెండ్లీ సర్వీస్ ఇన్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్(సీఎఫ్ఎస్టీ) పోర్టల్ పనిచేయగా ఇకపై దేశవ్యాప్తంగా కేంద్రం అమలు చేస్తున్న పరివాహన్ ద్వారా సేవలు అందనున్నాయి. ఆయా ఆర్టీఏ కార్యాలయాల్లో సేవలు పారదర్శకంగా అందుతున్నాయి.

విదేశాల నుంచైనా అవకాశం..

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన సారథి పోర్టల్ ద్వారా దేశ, విదేశాల నుంచైనా ఆన్‌లైన్‌లోనే ఇంటి నుంచి లైసెన్స్ తీసుకునే అవకాశం ఉంటుంది. రోడ్డు భద్రతపై పరిజ్ఞానం ఉంటే సులభంగా పరీక్ష ఉత్తీర్ణత కావొచ్చు. కాగా, సారథి పోర్టల్‌తో ఇంటి నుంచే లెర్నింగ్, డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందడం, రెన్యువల్, చిరునామా మార్పు వంటి అంశాలకు వీలు కల్పించనున్నారు. ప్రస్తుతం పోర్టల్ ద్వారా లైసెన్స్ తీసుకునే అవకాశం మాత్రమే కల్పించారు. అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్‌లు తీసుకొని విదేశాలకు వెళ్లిన వారి వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించక అక్కడి అధికారులు వాటిని తిరస్కరించిన ఘటనలు ఉన్నాయి. ఇలాంటి వాటికి చెక్ పెట్టొచ్చని ఎంవీఐలు భావిస్తున్నారు. కొత్త విధానంలో సాంకేతిక సమస్యల కారణంగా స్లాట్ బుకింగ్, వాహనదారులు ఆర్టీఏ కార్యాలయం వచ్చిన తర్వాత కొంత ఆలస్యం అవుతోంది. కొన్నాళ్లకు త్వరిగతిన సేవలు అందుతాయని అధికారులు అంటున్నారు. వాహనదారులు rarathiparivahan.gov.in / rarathirervicerలో స్లాట్ బుక్ చేసుకోవచ్చు.

ఇండియాలో ఒకే విధానం..

పరివాహన్ సారథి పోర్టల్ ద్వారా పొందిన లైసెన్స్ ఇండియాలో ఎక్కడైనా చెల్లుబాటు అవుతుంది. రెన్యువల్ టైంలో ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్‌లో చేసుకునే అవకాశం ఉంది. ఈకార్డు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చెల్లుబాటు అవుతుంది. ఇంతకాలం ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్ర పరిధిలోనే లైసెన్స్ ఉండేది. వివరాలు మరో రాష్ట్రంలో కనిపించేవి కాదు. అంతా గోప్యంగా ఉండేది. కానీ ప్రస్తుతం నూతనంగా వచ్చిన పరివాహన్ సారథి పోర్టల్ ద్వారా క్షణాల్లో వాహనదారుడి వివరాలు చేతికి వస్తాయి.



వరంగల్ రవాణాశాఖ కార్యాలయం

కనిపించని లైసెన్స్ కార్డు..



పరివాహన్ సారథి పోర్టల్‌లో లైసెన్స్ పొందిన వాహనదారుడికి కార్డు చేతికి రాదు. వాహనదారుడు డీఎల్ పరీక్ష రాయగానే ఆన్‌లైన్‌లోనే కార్డును డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రత్యక్షంగా కార్డు ఇచ్చేది ఏమీ ఉండదు. ఫోన్‌కు వచ్చిన లింక్ ఓపెన్ చేస్తే కార్డు మీ మొబైల్‌లోనే డౌన్‌లోడ్ అవుతోంది. తనిఖీ సమయాల్లో ఆర్టీఏ, పోలీస్ అధికారులు పోర్టల్‌లో డౌన్ లోడ్ చేసుకున్న కార్డును చూపిస్తే సరిపోతోంది.

సారథి పోర్టల్‌తోనే సేవలు



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా లర్నింగ్ లైసెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ జారీ సారథి పోర్టల్ ద్వారా అందిస్తున్నాం. ఆగస్టు 18న ప్రభుత్వం శ్రీకారం చుట్టగా ఈనెల మొదటి వారం నుంచి పూర్తి స్థాయిలో ఎల్ఎల్, డీఎల్‌లు అందజేస్తున్నాం. ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యలు అధిగమించి సేవలు అందిస్తున్నాం.

జి. సురేశ్ రెడ్డి డీటీసీ, హనుమకొండ వరంగల్

దళారుల వ్యవస్థ ఇక కనుమరుగు

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రవాణాశాఖ కార్యాలయాల్లో వాహనదారులు దళారులపై ఆధారపడాల్సిన పరిస్థితి. ఇంతకాలం ఆర్టీఏలో డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు లర్నింగ్ లైసెన్స్ కావాలన్నా ఎంతో కొంత ముట్టచెప్పాల్సి వచ్చేది. సారథి పోర్టల్ అందుబాటులోకి రావడంతో నిదానంగా ఈ అవినీతి తగ్గుముఖం పడుతోంది. ఆర్టీఏ సేవలు ఇక సులభంగా పొందే అవకాశం ఉన్నా.. చదువుకున్న వ్యక్తికే డ్రైవింగ్ లైసెన్స్ జారీ అయ్యే అవకాశం ఉంది. దీని ద్వారా దేశంలో ఎక్కడి నుంచైనా వాహనదారులు రవాణా సేవలు పొందే వెసులు బాటు వచ్చింది. ఆన్‌లైన్‌లో పరిజ్ఞానం ఉంటే లర్నింగ్ లైసెన్స్ పరీక్ష సులభతరంగా ఉంటుందని రవాణాశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ప్రస్తుతం లైసెన్స్‌లకు ధ్రువీకరణ పత్రాల హార్డ్ కాపీ జత చేయాల్సి వస్తోంది. కొత్త విధానంలో సాఫ్ట్ కాపీతో సరిపోతుంది. వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఆగస్టు 18 నుంచి పరివాహన్ సారథి ద్వారా సేవలు అందిస్తున్నారు. రోజుకు 430 మందికి ఆన్‌లైన్‌లో వివిధ లైసెన్స్‌లకు స్లాట్స్ అందుబాటులో ఉన్నాయి.

విద్యా రంగంలో కొత్త అధ్యాయం

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

ములుగు: సమ్మక్క, సారలమ్మ సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉన్నత విద్యా అవకాశాలు లభిస్తాయని, విద్యారంగంలో ఈ యూనివర్సిటీ కొత్త అధ్యాయం సృష్టిస్తుందని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో పరిధిలోని సాయిబాబా టెంపుల్ రోడ్ శివారులో సమ్మక్క, సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ విశ్వవిద్యాలయ ప్రహరీ నిర్మాణ పనులను మహబూబాబాద్, ఆదిలాబాద్ ఎంపీలు పోరిక బలరాం నాయక్, జి.నాగేశ్, కలెక్టర్ దివాకర టి.ఎస్, వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వైఎల్.శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమ్మక్క, సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుతో ములుగు జిల్లాకు ప్రత్యేక గౌరవం లభిస్తుందని, గిరిజన విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ఇది బలమైన వేదిక అవుతుందని తెలిపారు. ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి కట్టుబడి ఉందని, యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు, మౌలిక వసతులు సమకూర్చుతామని పేర్కొన్నారు. స్థానిక విద్యార్థులు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, యూనివర్సిటీ ఏర్పాటుతో విద్యా రంగం, జిల్లా అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, మాజీ ఎంపీ సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

8 నుంచి మూడేళ్ల 'లా' ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మూడేళ్ల 'లా కోర్సు ఐదో సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు అక్టోబర్ 8వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్ తెలిపారు. 8న మొదటి పేపర్, 10న రెండో పేపర్,14న మూడో పేపర్, 16న నాలుగో పేపర్, 18న ఐదో పేపర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆయా తేదీల్లో పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు.

స్కాన్ చేస్తే ఆలయ చరిత్ర

హన్మకొండ చౌరస్తా: చారిత్రక వేయిస్తంభాల ఆలయ చరిత్రను తెలుసుకునేందుకు ఇక గైడ్ అవసరం లేదు. ఆలయ చిత్రాలు, చరిత్రను క్షుణ్ణంగా వివరించేలా పురావస్తు శాఖ అధికారులు ఆలయ ప్రాంగణంలో క్యూఆర్ స్కానర్లను ఏర్పాటు చేశారు. గూగుల్ క్రోమ్ లోకి వెళ్లి స్కాన్ చేస్తే చాలు చరిత్ర తెలియజేస్తుంది.



ఆలయ ఆవరణలో పురావస్తు శాఖ ఏర్పాటు చేసిన క్యూఆర్ స్కానర్

పద్మశాలీలు ఉన్నత శిఖరాలకు చేరాలి

- అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందకట్ల స్వామి

హన్మకొండ: పద్మశాలి కులస్తులు ఉన్నత శిఖరాలకు చేరాలని అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందకట్ల స్వామి అన్నారు. పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (పోపా) ఆధ్వర్యంలో హనుమకొండలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతిభ కనబరిచిన పద్మశాలి విద్యార్థులకు ఆదివారం ప్రతిభ పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కందకట్ల స్వామి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని, పట్టుదలతో ముందుకు పోతే లక్ష్యాన్ని సాధిస్తారన్నారు. గ్రూప్స్, సివిల్స్‌లో పద్మశాలీలు ఇప్పుడిప్పుడే రాణిస్తున్నారన్నారు. రాజకీయాల్లోనూ రాణించాలని సూచించారు. పోపా రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివితే సాధించలేనిదంటూ ఉండదన్నారు. నిరుపేద విద్యార్థులకు చేయూతనివ్వాలని కోరారు. పోపా ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడమే తమ సంఘం లక్ష్యం అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభ అవార్డులు అందించి సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ కూరపాటి రమేష్, సీనియర్ జర్నలిస్ట్ గడ్డం కేశవమూర్తి, పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు పద్మశాలి సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్, పాము శ్రీనివాస్, గోషికొండ సుధాకర్, బైరి శ్యాంసుందర్, మాటేటి అశోక్, సంతోష్, ధర్మపురి రాజగోవింద్, దిడ్డి అనిల్, బత్తుల సత్యం, వంగరి వేణు, గుండేటి సతీశ్, కందకట్ల రాకేశ్, వడ్నాల సత్యనారాయణ, గుండు రవి, డాక్టర్ వన్నాల వెంకటరమణ, కుసుమ సతీశ్, వైద్యం రాజగోపాల్, డాక్టర్ కూరపాటి రాధిక, డాక్టర్ అంబటి అజయ్, మోతె రాజకుమార్, శ్రీరాముల శ్రీనివాస్, డాక్టర్ చింతకింది శ్రీనివాస్, విటోభా పాల్గొన్నారు.



విద్యార్థులకు అవార్డులు అందజేస్తున్న శామంతుల శ్రీనివాస్

బాలికలు, మహిళలకు జిల్లా స్థాయి చెస్‌పోటీలు

విద్యారణ్యపురి : ధర్మసాగర్ చెస్ నెట్‌వర్క్ క్లబ్, దండేపల్లి క్లబ్, ముప్పారం క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ సంబురాల్లో భాగంగా హనుమకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో బాలికలు, మహిళలకు వరంగల్ జిల్లా స్థాయి చెస్‌పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు గుంటి స్వప్న ప్రారంభించి మాట్లాడారు. ఈ పోటీలు బాలబాలికలు, మహిళల్లోని ప్రతిభ వెలుగులోకి రావడానికి దోహదపడుతాయన్నారు. అనంతరం న్యూరో సైకియాట్రిస్ట్ జగదీశ్‌బాబు మాట్లాడుతూ చదరంగం జీవన నైపుణ్యాలు నేర్పిస్తూ మానసిక శక్తిని వ్యూహాత్మక ఆలోచనలను ప్రోత్సహిస్తుందన్నారు. చీఫ్ ఆర్బటర్ రజనీకాంత్, ఆర్బిటర్ శివ , ధర్మసాగర్ చెస్‌క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్ ఈపోటీలను సమన్వయం చేశారు. సెయింట్ పీటర్స్ విద్యా సంస్థల అధినేత నారాయణరెడ్డి, విశ్రాంత ఇంజనీర్ పొన్నాల రామయ్య, వరంగల్ నిట్ ఆచార్యులు ఆనంద కిశోర్, విశ్రాంత ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, విశ్రాంత ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి, చెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి శ్రీహరిరామోజీ,హెచ్ఎం ధర్మ పాల్గొన్నారు.



చెస్ ఆడుతున్న బాలికలు, మహిళలు

బతుకమ్మ అంటేనే పూల పండుగ



మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ, పక్కన మేయర్ సుధారాణి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



బతుకమ్మ ఆడుతున్న మంత్రి కొండా సురేఖ

- రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ
- ఖుష్‌మహల్ మైదానంలో అంబరాన్నంటిన సంబురాలు

ఖిలా వరంగల్: బతుకమ్మ అంటేనే పూల పండుగ అని, బతుకమ్మ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పాల్సిన అవసరం మనందరిపై ఉందని రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని చారిత్రక మధ్యకోట ఖుషిమహాల్ మైదానంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి పండుగ విశిష్టతను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలిచేలా రాష్ట్ర వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బతుకమ్మ కేవలం పూల పండుగ కాదని, ఇది ఆడబిడ్డల ఆశయాల పండుగ, ప్రకృతిని పూజించే పండుగ, భూదేవికి సమర్పించే నైవేద్యమని చెప్పారు. అనంతరం మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా సీఎం రేవంత్‌రెడ్డి బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. నగర ప్రజల కోసం 29,30 తేదీల్లో సద్దుల బతుకమ్మ ఆట స్థలాల్లో ఏర్పాట్లు చేశామని, 16 ప్రాంతాల్లో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బైరబోయిన ఉమ, వేల్పుగొండ సువర్ణ, ముస్కమల్ల అరుణ, పోశాల పద్మ, పల్లం పద్మ, డీఆర్‌ఓ విజయలక్ష్మి, ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్లు ఇక్బాల్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన కటాక్షపూర్ చెరువు మత్తడి

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ చెరువు మత్తడి పెరిగింది. జాతీయ రహదారి–163పై ఉన్న మత్తడి ప్రవాహం పెరగడంతో వాహనదారులు ఇబ్బంది పడకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. లారీలు వెళ్లకుండా గూడెప్పాడ్ నుంచి మళ్లించారు. కార్లను శాయంపేట మీదుగా మళ్లించినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.



మత్తడి పోస్తున్న కటాక్షపూర్ చెరువు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

భూమి కావలెను

భూమి కావలెను. 10 నుండి 50 ఎకరాల వరకు నీటి సౌకర్యం కలిగిన వ్యవసాయ భూమి లీజుకు కావలెను. సంప్ర: 9440522536, 7013226716.

[SCA25008551]

SERVICES

CHANGE OF NAME

I, MD. CHARISHMA, D/o. MOHAMMED ANKOOS, AHMED (Old Name), R/o. H.No.2-7-115, Bhavani Nagar, NGO's Colony, Hanumakonda District, Telangana State - 506001, India. I have changed my name as MOHAMMED CHARISHMA, D/o. MOHAMMED ANKOOS AHMED (New Name) for all future purposes.

[SCA25008573]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/-
అదనపు లైను రూ॥ 60/- మాత్రమే
5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

వరంగల్ : 9705748198, 9866574715
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 7702221602
పరకాల : 9010299096
జయశంకర్ : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తూకంలో తేడాలొస్తే కఠిన చర్యలు

- వరంగల్ జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి మనోహర్



షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న లీగల్ మెట్రాలజీ అధికారులు

న్యూశాయంపేట: వరంగల్ నగరంలోని మటన్, చికెన్, చేపలు విక్రయించే వ్యాపారులు తక్కువ తూకంతో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి మనోహర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన నేతృత్వంలో నగరంలోని పలు మటన్, చికెన్, చేపలు విక్రయించే షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో ఉపయోగించే ఎలక్ట్రానిక్, సంప్రదాయ కాంటా యంత్రాలు ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయా.. లేదా? అనే విషయాల్ని ధ్రువీకరించి, స్టాంపింగ్ ప్రక్రియలను పరిశీలించారు. ఈతనిఖీల సందర్భంగా పలు దుకాణాల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించబడిందని, ముఖ్యంగా తక్కువ తూనికలతో విక్రయాలు జరుపుతున్న విషయం తనిఖీల్లో బయటపడ్డాయన్నారు. అక్రమాలకు పాల్పడే వారిని గుర్తించి 9 కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొనుగోలు చేసే టప్పుడు తూకం సరిగ్గా ఉందా లేదా? అనే విషయాలను వినియోగదారులే పరిశీలించుకోవాలని సూచించారు. వినియోగదారుల హక్కులను పరిరక్షించడమే ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశమని, ఇలాంటి తనిఖీలు తరచూ నిర్వహిస్తామని ఆయన తెలిపారు. వ్యాపారులు చట్టబద్ధమైన తూనికలు, కొలతల పరికరాలు వాడాలని, లేనిచో కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

వేడివేడి.. టేస్టీ టేస్టీగా



వానాకాలం, చలి కాలాల్లో ఎక్కువగా మొక్కజొన్న కంకులకు గ్రేటర్ వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి జిల్లాలోని మండల కేంద్రాలు, రహదారుల పక్కన విక్రయిస్తు ఉంటారు. రోడ్లకు ఇరువైపులా కాల్చిన, ఉడకబెట్టిన మొక్కజొన్న కంకులను ప్రయాణికులు కొనుగోలు చేసి తింటుంటారు. అడ్డా కూలీలు, కొందరు రైతులు మొక్కజొన్న పొత్తులను నగరానికి తీసుకొచ్చి విక్రయించి ఉపాధి పొందుతున్నారు.

- కాల్చిన, ఉడకబెట్టిన మొక్కజొన్న కంకులకు భలే డిమాండ్

కాజీపేట : ట్రై సిటీలోని అనేక ప్రాంతాల్లో ఉడకబెట్టిన, కాల్చిన కంకులు తినడానికి ప్రజలు మక్కువ చూపుతున్నారు. ప్రధాన రహదారులు, రైల్వే స్టేషన్లు, బస్టాండులలో తోపుడుబండ్లపై కాల్చిన, ఉడకబెట్టిన మొక్క జొన్న కంకులను విక్రయిస్తూ చిరు వ్యాపారులు, కొందరు రైతులు, మరికొందరు అడ్డా కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఈ సీజన్‌లో మక్క కంకుల విక్రయం జోరుగా సాగుతోంది.

కంకులకు భలే డిమాండ్..

నగరంలో దాదాపు 50కి పైగా ప్రాంతాల్లో చిన్న బొగ్గుల పొయ్యి ఏర్పాటు చేసుకొని కాల్చిన మొక్కజొన్న కంకులు విక్రయిస్తున్నారు. ప్రతీ ఏటా వేడి వేడి మొక్కజొన్న కంకులకు ఆదరణ పెరగడంతో కాల్చి విక్రయించే కేంద్రాలు పెరిగిపోతున్నాయి. దీంతో నగరంలోని అనేక ప్రాంతాల్లో మొక్కజొన్న కంకుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే, ఉడకబెట్టి కంకులను విక్రయిస్తున్నారు. రూ.15నుంచి రూ.20లకు ఒక కంకి చొప్పున అమ్ముతున్నారు.



కాజీపేట రైల్వే స్టేషన్ పరిధిలో కంకులు కాల్చుతున్న మహిళ

మొక్కజొన్న కంకులు ఇష్టం



వానాకాలం, చలికాలాల్లో కాల్చిన కంకులు తినడం అంటే ఎంతో ఇష్టం. రహదారిపై ఆగి మరి కొని తింటా. పచ్చి కంకుల ధరకన్నా కాల్చినా, ఉడక బెట్టిన కంకులకు నాలుగు పైసలు ఎక్కువే. అయినా అమ్మకందారుల శ్రమను గుర్తించాలి.

- కుమ్మరి రాజ్‌కుమార్, సోమిడి

బస్తీబస్తీ తిరుగుతూ...

రెండేళ్ల నుంచి తోపుడు బండ్లపై మొక్కజొన్న కంకుల విక్రయాలు పెరుగుతున్నాయి. సాధారణంగా పొట్టు తీసి కాల్చడం కంటే పొట్టుతో సహా కాలిస్తే గింజలు మరింత రుచిగా ఉంటాయని రైతులు చెబుతున్నారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది జూలై నుంచే మక్క కంకులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి.

కొన్ని ప్రాంతాల్లో రైతులే నేరుగా..

కొన్ని ప్రాంతాల్లో రైతులే నేరుగా మొక్కజొన్న కంకులను విక్రయిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చుట్టూ పక్కల ప్రాంతాల రైతులు పండించిన మొక్కజొన్న కంకులను వ్యవసాయ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. వివిధ జిల్లాలకు చెందిన రైతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి వరంగల్ నగరంలోని ప్రత్యేక అడ్డాల్లో కంకులను హోల్‌సేల్‌గా విక్రయిస్తున్నారు. ఇలా విక్రయించడం వల్ల కొంత లాభం వస్తున్నప్పటికీ ట్రాఫిక్ పోలీసుల నుంచి ఇబ్బందులు తప్పడంలేదని వారు ఆవేదన చెందుతున్నారు.